సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 30 । జూలై । 2023



'పట్టు' తప్పింది..!

సమైక్య రాష్ట్రంలో పట్టు రైతులకు మెరుగైన సేవ లందించిన.. జి.కొత్తకోట మండలం బయ్యప్ప గారిపల్లె గ్రామంలోని ప్రాథమిక బీజక్షేత్రంలో పట్టుగూళ్ల ఉత్పత్తి ఆగిపోయింది. -8లో



డ్రాగా ముగిసిన మ్యాచ్

కడప నగరంలోని వైఎస్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. -8లో

గరిష్టం/కనిష్టం
34.7/26.6

వాతావరణం

జిల్లాలో శనివారం 26.6 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు నేరుగా అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్: ఏపీఆర్ఈఐఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్దూ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతులు చదువుతున్న ముస్లిం మైనార్టీ విద్యార్థులను ఎలాంటి పరీక్షలు లేకుండా నేరుగా పాఠశాలలో చేర్చుకుంటామని ఏపీ ఆర్ఈఐఎస్ ప్రిన్సిపాల్, కన్వీనర రామచంద్రయ్య తెలిపారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గరుకుల పాఠశాలల్లో జనరల్, మైనార్టీ బాలురు.. మే నెల 25వ తేదీన పరీక్ష రాసి ఇప్పటివరకు సీట్లు రాని వారు ఎవరైనా ఉంటే వెంటనే కలవాలని తెలిపారు. వివరాలకు 7780179446, 9491035236 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ జిల్లాకు రాక

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆదివారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మార్కాపురం నుంచి బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు కడప ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని రాత్రికి ఇక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు కడప నుంచి బయలుదేరి 10.30 గంటలకు పులివెందుల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. మన రాష్ట్రం-మన నాయకుడు వైఎస్సార్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఆధ్వర్యంలో అక్కడి మున్సిపల్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. 6 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 7 గంటలకు ఇడుపులపాయను సందర్శిస్తారు. రాత్రి పులివెందుల గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు పులివెందులలో బయలుదేరి 10.30 గంటలకు ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. వైఎస్సార్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు ప్రొద్దుటూరు నుంచి కడప ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రికి బస చేస్తారు. బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు కడప నుంచి బయలుదేరి మదనపల్లెకు వెళతారు.

3న అథ్లెటిక్ మీట్

మదనపల్లె సిటీ: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆగస్టు 3 నుంచి రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌కు పలు రాష్ట్రాల నుంచి నవోదయ విద్యాయల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

వాహనదారులు సకాలంలో పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని వాహన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ ఈ.మీరాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 7263 వాహనాలు రవాణా శాఖకు త్రైమాసిక బకాయిలు చెల్లించలేదని వాహన యజమానులు స్పదించి పన్నుబకాయిలను చెల్లించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో వాహనాలు పట్టుబడితే చెల్లించిన పన్నులతో పాటు 200 శాతం అదనంగా జరిమానా విధిస్తామన్నారు. జిల్లాలో 944 విద్యా సంస్థల బస్సులకు గాను 855 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందన్నారు. ఇంకా 89 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిందన్నారు. సంబంధిత బస్సులు విద్యా సంస్థల వద్ద లేనట్లయితే రిజిస్ట్రేషన్ రద్దు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కడపలోని వివిధ ప్రాంతాల్లో కెమెరాల ద్వారా స్టాప్‌లైన్ క్రాసింగ్, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్‌రైడింగ్ మొదలైన మోటార్ వాహనచట్టం ఉల్లంఘనలను గుర్తిస్తే కంప్యూటర్ ద్వారా కేసులు నమోదు చేస్తామన్నారు. గత నెల జూన్ నుంచి ఇప్పటి వరకు 5047 కేసులు నమోదు చేశామన్నారు.



“ ఇతని పేరు ఎం సుబ్బరాయుడు. వయసు 56 ఏళ్లు. కడప నగరం ఎర్రముక్కపల్లెలోని చింతలపల్లికి చెందిన వారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడే వారు. ఒక రోజు వైద్యులు బైపాస్ సర్జరీ చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందొచ్చని తెలిసి సంతోష పడ్డారు. ఆరోగ్య శ్రీ కారణంగా తన కుటుంబానికి గుండె నిబ్బరం కలిగిందని సుబ్బరాయుడు తెలిపారు. సర్జరీకి ప్రభుత్వమే ఖర్చును భరించడంతో పాటు ఆసరా కింద రూ. 9,500 బ్యాంకు ఖాతాలో వేశారు. తమలాంటి పేదలకు ఆరోగ్య శ్రీ అండగా నిలుస్తోందని ఆయన తెలిపారు.



“ ఈమె పేరు పీ లక్ష్మి. 38 ఏళ్లు. ముద్దనూరు నివాసి. ఈమె ఆర్థోకు సంబంధించిన వ్యాధితో బాధపడేవారు. సరిగ్గా నడవలేని పరిస్థితి వైద్యులను సంప్రదించగా సర్జరీ చేయాలని తెలిపారు. దీంతో ఆమె ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందారు. సర్జరీ తరువాత ఇప్పుడు బాగా నడవ గలుగుతున్నానని లక్ష్మీ తెలిపారు. సర్జరీ అనంతరం కోలుకొనే సమయంలో ఆసరా కింద తనకు రూ 8,375 వచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉన్నామని తెలిపారు.

ఆరోగ్య శ్రీ వెలుగులు



ఆరోగ్యానికి మించిన సంపద మరేది లేదు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిగణలోకి తీసుకున్నారు. ఫలితంగా ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే 'డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ'కి పెద్ద పీట వేశారు. దీంతో పేదలు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఖరీదైన కీలక వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. నాలుగేళ్ల కాలంలో లక్షలాది మంది ఉచితంగా వైద్య సేవలు పొంది, ఆరోగ్య వెలుగులు చూస్తున్నారు.

- జిల్లాలో మొత్తం 97 నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు
- గడిచిన నాలుగేళ్లలో 2.30 లక్షల మందికి ఉచిత వైద్యం
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదల జీవితాల్లో ఆరోగ్య నిశ్చింత



ఆరోగ్యశ్రీ కింద సర్జరీ నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు అబిద్ (ఫైల్)

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేశారు. ఫలితంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గడిచిన నాలుగేళ్లలో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలు ఆపద వేళలో ఉచితంగా వైద్య సేవలు పొంది పునర్జన్మ పొందారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ వర్తిస్తుంది. ఈ పథకం కింద దాదాపు అన్ని వ్యాధులకు ఉచిత వైద్యం అందుతోంది. ఇది వరకు సర్జరీ కేసులకు మాత్రమే ఈ స్కీం వర్తించేది. సాధారణ సీజనల్ వ్యాధులకు సంబంధించి డెంగీ, మలేరియా, మెదడు వాపు, స్వైన్ ఫ్లూ, కామెర్లు తదితర వ్యాధుల ఈ పథకంలో లేవు. దీంతో నిరుపేదలు ఇబ్బందులు పడేవారు. ఉదాహరణకు డెంగీ ఒక్కో సారి ప్రాణాంతకగా మారుతుంది. రక్తం ప్లేట్‌లెట్లు తగ్గినప్పుడు ప్రమాదకరంగా మారుంది. అలాంటి సమయంలో వాటిని ఎక్కించడానికి ఒక రోజుకు రూ 8 వేల నుంచి రూ 10 వేల వరకు ఖర్చు అవుతుంది. అలా ఒక వారం రోజుల పాటు హాస్పిటల్‌లో ఉంటే రూ ఒక లక్ష పైగా బిల్లు దాటుతుంది. పేదలు అంత డబ్బును చెల్లించలేని పరిస్థితి. రెండేళ్ల క్రితం నుంచి ఈ సీజనల్ వ్యాధులను కూడా ఆరోగ్య శ్రీలో చేర్చారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో మెరుగైన ఆరోగ్య జీవనం ఏర్పడినట్లయింది.

అప్పుల భారం నుంచి విముక్తి...

మామూలు జ్వరానికి ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళితే వైద్యులు ఫీజు కింద రూ 300 తీసుకుంటారు. రక్త పరీక్షలకు కనీసమంటే రూ 500 వరకు అవుతుంది. మందుల వాడడానికి మూడు లేదా ఏడు రోజుల కోర్స్‌కు రూ 350 నుంచి రూ 600 కుపైగా ఖర్చు చేయాలి. ఒక వేళ వ్యాధి అదుపులోకి రాకపోతే ఖర్చు మరింతగా తడిసి మోపెడు అవుతుంది. అంటే కేవలం సాధారణ రోగానికి కూడా దాదాపు రూ 1600 కు పైగా ఖర్చు అవుతోంది. తాజాగా ప్రభుత్వం రూ 1000 ఖర్చు దాటితే ఆరోగ్య శ్రీని వర్తింప చేయడం పేదలకు వరంగా మారింది.

విశ్రాంతి వేళ 'ఆసరా'గా..

రోగికి ఆపరేషన్ తరువాత కొన్నాళ్ల పాటు ఉచితంగా మందులను అందజేస్తారు. విశ్రాంతి సమయంలో ఎలాంటి ఆర్థిక సహాయం లభించదు. వారంతా నిరుపేదలు. అలాంటి వారు వైద్య సేవల అనంతరం ఇంటి వద్ద కోలుకునే సమయంలో వారికి ఎలాంటి ఆర్థిక భరోసా ఉండదు. మెరుగైన ఆరోగ్యానికి పౌష్టికాహారం కూడా సమకూరదు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిగణలోకి తీసుకున్నారు. 2020వ సంవత్సరంలో ఆసరా పథకాని ప్రవేశ పెట్టారు. నాటి నుంచి ఆసుపత్రిలో వైద్యం అనంతరం కోలుకొనే సమయంలో నిబంధనల ప్రకారం ఒక రోజుకు రూ 225 ఆర్థికసాయం అందనుంది. కనిష్టంగా పక్షవాతం వ్యాధిగ్రస్తులకు కోలుకొనే సమయంలో దాదాపు రూ 30 వేలకు పైగా ఆసరా కింద ఆర్థికసాయం అందనుంది.

ఒక నెలకు 3 వేల మందికి పైగా వైద్య సేవలు...

జిల్లాలో ఈ పథకం కింద ప్రతి నెలా 2 వేల మంది నెట్ వర్క్ హాస్పిటళ్లలో, మరో 1000 మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉచిత వైద్య సేవలను పొందుతున్నారు. మొత్తం 3 వేల మంది వ్యాధిగ్రస్తుల్లో దాదాపుగా 95 శాతానికి పైగా ఉచితంగా సర్జరీలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి సంబంధించి మొత్తం 97 నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ ద్వారా అర్హులు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో ఉచిత వైద్యం...

ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవల పరిధితోపాటు హాస్పిటల్స్ సంఖ్యను కూడా పెంచుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఇక్కడ వైద్య సేవలు పొందాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇక ఇతర రాష్ట్రాల్లో అయితే ఎన్నో సమస్యలతో పేదలు విసిగిపోయారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



పేదల పాలిట డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం వరం లాంటిది. దీని ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఆరోగ్య శ్రీ పేదలకు అండగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

పక్కాగా అమలు...



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోంది. ఇందులో ఎలాంటి లోపాలు లేకుండా ఉండడానికి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఏవైనా సమస్యలు ఉంటే ఆయా ఆసుపత్రుల్లో ఉండే ఆరోగ్య మిత్రలకు ఫిర్యాదు చేయాలి.
– డాక్టర్ బాలాంజినేయులు, జిల్లా కో ఆర్డినేటర్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్

జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చికిత్స వివరాలు

సంవత్సరం	చికిత్స పొందినవారు	ఖర్చు వివరాలు
2019-2020	29,103	75,99,06,847
2020-2021	36,279	86,08,50,112
2021-2022	61,779	124,23,32,926
2022-2023	86,929	172,39,52,931
2023-2024 (ఇప్పటివరకు)	16,470	31,19,27,884

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నందు వ్యాధుల సంఖ్య పెంపు వివరాలు

ఏడాది	వ్యాధుల సంఖ్య
2007(మొదటి విడత ప్రారంభం)	542
2008(రెండోవిడత)	1,040
2021	2,434
2022	3,255

'ఆసరా' కింద లబ్ధిపొందిన వారి వివరాలు

సంవత్సరం	కేసులు	చెల్లింపులు (రూకోట్లలో)
2019-2020	5,499	3.93
2020-2021	14,686	9.09
2021-2022	27,780	14.74
2022-2023	38,991	20.51
2023-2024 (ఇప్పటివరకు)	12,475	6.02
మొత్తం	99,431	54.29

తిరుపతి-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైలు



షోలాపూర్ ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా తిరుపతి-షోలాపూర్-తిరుపతి మధ్య వారాంతపు రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఆగస్టు 3న రాత్రి 9.40 గంటలకు ఈ రైలు (01437) షోలాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.45 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. తిరుపతిలో అదే రాత్రి 9.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 7.10 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, యాదగిరి, వాడి, కలబుర్గి, బీదర్, లాతూర్ మీదుగా షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలస్యంగా తిరుమల ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప-విశాఖపట్టణ-కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ శనివారం 8 గంటలు ఆలస్యంగా నడిచింది. విశాఖలో నిర్వహణ పనుల వల్ల ఈ రైలు శుక్రవారం విశాఖపట్టణంలోనే ఆలస్యంగా బయలుదేరింది. శనివారం ఉదయం 7 గంటలకు కడపకు చేరుకోవాల్సిన రైలు మధ్యాహ్నం 3 గంటలకు చేరింది. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఈ రైలు వాటర్ ఫిల్లింగ్, పారిశుద్ధ్య పనుల కోసం కొండాపురం వెళ్లాల్సి వచ్చింది. ఈ కారణంగా శనివారం సాయంత్రం 5.45 గంటలకు విశాఖకు బయలుదేరాల్సిన రైలు రాత్రి 10.45 గంటలకు బయలుదేరింది. ఈ విషయం తెలియని ప్రయాణీకులు కడప రైల్వేస్టేషన్‌కు నిర్ణీత సమయానికి చేరుకుని ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



లంకమల అభయారణ్యంలో అటవీ సిబ్బందితో జిల్లాకలెక్టర్ వి.విజయరామరాజు, జేసీ, డీఎఫ్‌ఓ, ట్రైనీ కలెక్టర్లు

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

బద్వేలు అర్బన్ : జీవ వైవిద్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు అటవీ అధికారులకు సూచించారు.ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం బద్వేలు రేంజ్ పరిధిలోని లంకమల అభయారణ్యాన్ని జేసీ గణేష్‌కుమార్,డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి,ట్రైనీ కలెక్టర్లు రాహుల్‌మీనా,మౌర్య,కడప నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ చంద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇందులో బాగంగా అభయారణ్యంలోని రెడ్డిబావి బేస్ క్యాంప్ నుంచి బండిగాని సెల వరకు ట్రెక్కింగ్ నిర్వహించి పులుల ఆవాసాలు పరిశీలించారు.పులుల సంఖ్యను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో పులులు పోషించే కీలక పాత్రను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పులుల ఆవాసాల సంరక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలని అటవి అధికారులను ఆదేశించారు.

- జిల్లాని అడవులలో పులుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) పీవీ. సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. టైగర్ కారిడార్లో ట్రాప్ కెమెరాల ద్వారా పులుల గణనను గుర్తించి వాటి ఆవాసాలను పెంపొందించనున్నట్లు చెప్పారు. పులులకు, వణ్యప్రాణులకు హానీ కలగకుండా బేస్ క్యాంపులను పటిష్టం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బద్వేలు ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ వెంకటశేషయ్య, రేంజ్ సిబ్బంది రాజేష్ రెడ్డి , శ్యామ్ సుందర్, సువర్ణకుమార్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బాసికోత్సవం



ప్రార్థనలు నిర్వహిస్తున్న కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని

చిన్నమండెం: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని చిన్నమండెం మండలంలో మొహర్రం ఉత్సవాలు ప్రతి ఏడాది వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా కీలక ఘట్టమైన బాసికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముంబై ఏజాస్ అలిఖాన్ తన ఇంటి నుంచి బాసికాన్ని పీర్ల మఖాన్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలను తిలకించారు. ఈ ఉత్సవంలో కడప పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఆరిపుల్లా హుసేనీ పాల్గొన్నారు.



బాసికాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

క్లుప్తంగా

బియ్యం వ్యాన్లకు నిప్పు



కాలిపోతున్న బియ్యం పంపిణీ వ్యాన్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న రెండు బియ్యం పంపిణీ చేసే వ్యాన్లకు శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఏడాది కాలంగా వీటిని వ్యవసాయ గోడౌన్ దగ్గర పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టపగలే వాటికి నిప్పు పెట్టారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పారు. కాలిపోయిన వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ అహ్మద్‌బాషా శనివారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నమనేనిపల్లె గ్రామానికి చెందిన వెన్నపూస కేశవరెడ్డి వ్యక్తిగత పనిపై లావనూరు గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ బంకు పక్కన నిలబడి ఉండగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన కేశవరెడ్డిని స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం సంభవించిన ఇంటి నుంచి వస్తున్న పొగ

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓస్ కాలనీలో గోదిన రామసుబ్బయ్య అనే వ్యక్తి ఇంటిలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎ.సిలో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే ప్రమాదాన్ని నివారించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్ వీరారెడ్డి, డ్రైవర్ కలందర్, ఫైర్‌మాన్ సుబ్బన్న, కుమారస్వామి, హోంగార్డు నాగరాజులు పాల్గొన్నారు. ప్రమాదంలో రూ. 2 లక్షల మేరకు ఆస్తినష్టం కలిగిందని బాధితుడు తెలిపారు.

పట్టు తప్పింది..!

- ప్రాథమిక బీజక్షేత్రంలో ఆగిన పట్టుగూళ్ల ఉత్పత్తి
- 24 ఏళ్ల సేవలకు సెలవు
- 18 ఎకరాల్లో వెలుగు వెలిగిన కేంద్రం
- ఇప్పుడు రెండెకరాల్లో విత్తన సాగు



ప్రాథమిక బీజక్షేత్రం



విక్రయం కోసం సాగుచేస్తున్న మల్బరీ పంట

బి.కొత్తకోట : సమైక్య రాష్ట్రంలో పట్టు రైతులకు మెరుగైన సేవలందించి, వారి కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె గ్రామంలోని ప్రాథమిక బీజక్షేత్రంలో పట్టుగూళ్ల ఉత్పత్తి ఆగిపోయి మనుగడం కోసం రెండు ఎకరాల్లో విత్తన ఉత్పత్తి కేంద్రంగా మారిపోయింది. 24 ఏళ్లకు పైగా పట్టు రైతుల సేవలతో తరించిన ఈ కేంద్రం ఇటు పూర్తిగా మూతపడలేక, పూర్తిగా పనిచేసే పరిస్థితి లేక కొట్టుమిటాడుతోంది. పట్టు గుడ్ల ఉత్పత్తి నిలివేయడంతో కేంద్రం మూతదశకు చేరుకొంది. అధికారులు, సిబ్బంది విధుల్లోనే ఉన్నప్పటికీ వారికి చేతినిండా పనిలేదు.

బి.కొత్తకోట-మదనపల్లె రహదారిపై 1990లో 18 ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తూ పట్టు రైతులకు మేలైన పట్టుగూళ్ల తయారీ ప్రారంభమైంది. ఈ కేంద్రం ప్రారంభంతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులు మల్బరీ పండించి పట్టుగూళ్ల ఉత్పత్తి ప్రారంభించారు. పీ3-మౌలిక విదేశీజాతీ విత్తన కేంద్రమైన ఇక్కడికి కర్ణాటకలోని మైసూరు నుంచి పీ-3 పట్టుగుడ్లను తీసుకొచ్చి రేరింగ్ చేస్తారు. ముత్తాత గుడ్ల నుంచి కొడుకు, మనువడు రకం గుడ్లను రేరింగ్ చేశాక పీ-2 గుడ్లు తీస్తారు. వీటిని సీడ్‌ఫార్మ్‌కు తరలించాక పీ-2 నుంచి పీ-1 గుడ్లు తీస్తారు. దీనినే విత్తన గుడ్లుగా రైతులకు సరఫరా చేయడం జరుగుతూ వచ్చింది. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు నాణ్యమైన, రోగరహిత గుడ్లను ఉత్పత్తి చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వున్న గ్రేనేజీలకు పట్టుశాఖ ద్వారా సరఫరా చేసేవారు. ఈ ప్రక్రియ కోసం రేరింగ్ భవనాలు, వర్మీ కంపోస్టు తయారీ భవనాలు ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం వరకు ఓ వెలుగు వెలిగిన కేంద్రానికి నీటి సమస్య ప్రధాన కారణంగా మల్బరీసాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఏడాదికి 250 నుంచి 300కు పైగా గుడ్లను తెచ్చేవారు. ఒక్కో గుడ్డు నుంచి 400కు పైగా గూళ్లను తీయడం జరిగేది. ప్రస్తుతం గుడ్ల సంఖ్య భారీగా తగ్గింది. ఐదేళ్లలో పరిస్థితిని పరిశీలిస్తే.. 2009-10లో 118, 2010-11లో 72, 2011-12లో 58, 2012-13లో 54, 2013-14లో 36 గుడ్లను మాత్రమే తీసుకొచ్చారు. ఆ తర్వాత నామమాత్రంగా ఉత్పత్తి కొనసాగుతూ వచ్చి ప్రస్తుతం ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన ఈ కేంద్రంలో పదేళ్లుగా పట్టుగుడ్ల ఉత్పతి నిలిచిపోయిన గత చరిత్రగా మిగిలిపోతోంది. పడమటి మండలాల్లో మల్బరీ సాగుకు ఈ కేంద్రం ప్రోత్సాహంతో గ్రామాలకు గ్రామాలే పట్టు గ్రామాలుగా విరాజిల్లాయి. పట్టు రైతాంగానికి 24 ఏళ్ల సేవలు అందించిన ఈ కేంద్రం సెలవు తీసుకొంది.

తగ్గిన ఉద్యోగుల సంఖ్య

ఈ కేంద్రంలో గతంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్, వివిధ హోదాల్లో 12 మంది ఉద్యోగులు, క్షేత్రస్థాయి కార్మికులు 16 మంది పని చేసేవారు. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు అసిస్టెంట్ సెరికల్చర్ అధికారులు, ఆరుగురు క్షేత్ర సహాయకులు పని చేస్తున్నారు. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాథమిక బీజ క్షేత్రం కేంద్రానికి బాధ్యతలు చూస్తున్నారు. ఏడీతోపాటు ఒక ఇన్‌స్పెక్టర్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఫార్మర్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు.

విత్తన ఉత్పత్తి

గూళ్ల ఉత్పత్తి నిలిచిపోవడంతో అధికారులు ఈ కేంద్రం మూతపడకుండా ఆలోచన చేశారు. మల్బరీ పంట కోసం విత్తన పుల్లలను పండించి రైతులకు విక్రయించేందుకు నిర్ణయించి రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మల్బరీ పంట పూర్తయ్యాక వాటిని పుల్లలుగా కత్తిరించి రైతులకు విక్రయిస్తారు. ఇదిలా ఉండగా ఇక్కడి భవనాలు నిరుపయోగంగా మారాయి. వీటిలో ఒకదాన్ని ఉద్యానవన పరిశోధన కేంద్రం కార్యాలయం కోసం కేటాయించారు. దీనిపై ఏడీ దేవోత్తమరెడ్డి మాట్లాడుతూ పట్టుగుడ్ల ఉత్పత్తి ఆగిపోయిందని, రెండెకరాల్లో విత్తన మల్బరీ ఆకును పెంచుతున్నామని చెప్పారు.

దేవునికడపలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సోమయాజులుకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు శనివారం దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. టీటీడీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చక బృందం పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం ఆయన స్వామి మూలమూర్తిని దర్శించుకున్నారు. అర్చకులు క్షేత్ర చరిత్ర, విశేషాలను వివరించారు. ఆ పక్కనే ఉన్న శ్రీ పద్మావతి మాతను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ తదితరులు వారికి స్వామి శేషవస్త్రం, వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గంజాయి స్మగ్లర్‌పై పి.డి. యాక్ట్



జంబు రమేష్ (ఫైల్)

కడప అర్బన్ : జిల్లాలోని ఖాజీపేట మండలం బి.కొత్తపల్లికి చెందిన జంబు రమేష్ అనే గంజాయి స్మగ్లర్‌పై పి.డి. యాక్ట్ ప్రయోగించినట్లు జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ శనివారం తెలియజేశారు. ఇతనిపై జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయంకు సంబంధించిన కేసులు 8 నమోదై విచారణలో వున్నాయి. అక్రమంగా లాభార్జన చేసేందుకు గంజాయిని కలిగి వుండటం, రవాణా, విక్రయాలను పాల్పడుతుండే వాడు. ఇతనిపై పి.డి.చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పర్యవేక్షణలో పోరుమామిళ్ల సీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.డి.యాక్ట్ ప్రయోగం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సంబంధిత నిందితుడిపై అమలు కోసం కడప కేంద్రకారాగార అధికారులకు అందజేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

మతసామరస్యానికి ప్రతీక మస్తాన్‌స్వామి ఉరుసు

- నేడు మధ్యాహ్నం గంధం, రాత్రి ఊరేగింపు
- సోమవారం రాత్రి ఊరేగింపు, గుండం పూడ్చుట



మస్తాన్‌స్వామి

పెండ్లిమర్రి : హిందూ-ముస్లింల ఐక్యతకు ప్రతీకగా, మతసామరస్యానికి చిహ్నంగా నిలుస్తోన్న కొండూరు మస్తాన్‌స్వామి ఉరుసు ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నారు. పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామ దైవం మస్తాన్‌స్వామి. దశాబ్దాల చరిత్ర ఉన్న మస్తాన్‌స్వామి ఉరుసును గ్రామంలో హిందువులు ముందుండి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి పట్ల ఇక్కడి ప్రజలు అపార నమ్మకం, భక్తి ప్రదర్శిస్తారు. శుభకార్యాలు ఏమి నిర్వహించినా ముందుగా మస్తాన్‌స్వామి ఆశీస్సులు పొందడం సంప్రదాయంగా వస్తోంది. మస్తాన్‌స్వామిని కొలిస్తే సంతానం కల్గుతుందని, అనారోగ్యాలు మటుమాయం అవుతాయనే విశ్వాసం భక్తులు వ్యక్తం చేస్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఆదివారం ఉదయం గుండం తువ్వుట నుంచి ఉరుసు ఉత్సవం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 1 గంటకు చెంచిరెడ్డి వంశస్తులు గంధం సమర్పించిన అనంతరం గ్రామస్తులు చదివింపులు, పసిబిడ్డలకు చెక్కర తూకం, వెండి గొడుగులు సమర్పణ లాంటి మొక్కులు చెల్లించుకుంటారు. సాయంత్రం విచిత్ర వేషధారణ ధరించి ప్రదర్శన చేయడం ఆనవాయిగా వస్తోంది. రాత్రి మేళ, తాళాల వాయిద్యాలతో స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు. సోమవారం రాత్రి మరోమారు స్వామి ఊరేగింపు ఉంటుంది. ఈ సందర్భంగా వరపడిన మహిళలను ఆశీర్వదిస్తారు. అనంతరం గుండం పూడ్పుటతో ఉరుసు ఉత్సవం ముగియనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న సౌత్‌జోన్-నార్త్‌జోన్ జట్లు



వీరారెడ్డి (123 పరుగులు)



మన్విత్‌రెడ్డి (110 పరుగులు)



శ్రీరామ్ (6 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడోరోజు శనివారం 256 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 153 ఓవర్లలో 435 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.హెచ్.వీరారెడ్డి 123, మన్విత్‌రెడ్డి 110, భవానీప్రసాద్ 77 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్ శ్రీరామ్ 6 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. జట్టులోని సాయిశ్రవణ్ 96 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా నార్త్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 238 పరుగులు చేయగా, సౌత్‌జోన్ జట్టు 435 పరుగులు చేసింది. దీంతో సౌత్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి



మెటీరియల్ అందజేస్తున్న డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా కడప డిపోలో లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూలులో శిక్షణ పొందిన డ్రైవర్లు వృత్తిలో ఉత్తమంగా రాణించాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. 15వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కడప డిపోలో ఇప్పటి వరకు 15లు బ్యాచ్ పూర్తి చేశామని, ప్రస్తుతం 16వ బ్యాచ్‌కు సంబంధించి అభ్యర్థులకు మెటీరియల్ అందజేశామన్నారు. 17వ బ్యాచ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, నగరంలోని కారు, జీపు డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు గంటపాటు వాహనంలోని వివిధ భాగాల పనితీరు, అలాగే రోడ్లు, రోడ్లపై ఉండే మార్కింగ్‌లు, రోడ్డు పక్కన గల సైన్ బోర్డులు, సిగ్నల్స్ గురించి వివరంగా నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇతర వివరాలకు 73828 65145 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు కృష్ణారెడ్డి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

రామాపురం : కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం లారీ, బైక్ ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం పాతరాయచోటికి చెందిన పిక్కిలి రోహిత్ (20), గాలివీడుకు చెందిన వంశీ, మదనపల్లెకు చెందిన నవీన్ కొత్త మోటార్ సైకిల్‌పై రామాపురం వైపు నుంచి రాయచోటికి వస్తున్నారు. పెట్రోల్ బంకు సమీపానికి రాగానే రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రోహిత్ అక్కడికక్కడే మృతి చెందగా.. నవీన్, వంశీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోహిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

'దిశ' పోలీస్‌స్టేషన్ వద్ద భద్రతా చర్యలు

కడప అర్బన్ : కడప నగరంలోని 'దిశ' పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం నుంచి భద్రతా చర్యలు మరింత పటిష్టం చేశారు. మహిళలు, చిన్నారుల నేరాల నియంత్రణ, భార్యాభర్తల మధ్య మనస్పర్థలను తొలగింపచేసి కౌన్సెలింగ్ ద్వారా వారి కాపురాలను చక్కదిద్దేందుకు జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప 'దిశ' డీఎస్పీ ఎస్. రమాకాంత్, సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు, మహిళా సిబ్బంది తమ వంతుగా కృషి చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశించగానే ఎవరెవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారనే అంశాలపై సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఈనెల 28న ఓ మహిళ తన వెంట ఉద్దేశ పూర్వకంగానే విష ద్రావణం తెచ్చుకుని అక్కడి బాత్‌రూంలోకి వెళ్లి తాగింది. వెంటనే గమనించిన పోలీసులు ఆమెను రిమ్స్‌కు పంపించారు. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో కోలుకుంటోంది. ఈ సంఘటనపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ వెంటనే అక్కడ 'భద్రతా చర్యలు' పటిష్టం చేసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బాధితులను మాత్రమే లోనికి పంపిస్తున్నారు. అవసరమైన వారిని మరలా అనుమతిస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



రమాదేవి మృతదేహం

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ హృషికేశవరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని గంగయ్య భార్య పగిడిపల్లి రమాదేవి (33) చాలా కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేది. శనివారం మధ్యాహ్నం తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు 12 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నారు. రమాదేవి మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కార్లు ఢీకొని ఒకరి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన గోపాల్, మునికుమార్‌వర్మ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె దగ్గర శనివారం సాయంత్రం రెండు కార్లు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం పాపసాహెబ్‌పేటకు చెందిన గోపాల్(40), వైజాగ్‌కు చెందిన మునికుమార్‌వర్మ(36) కారులో కలసపాడు నుంచి బి.మఠం వస్తున్నారు. గోపాల్ కారు డ్రైవింగ్ చేస్తున్నారు. తోట్లపల్లె దగ్గర రోడ్డు ఎత్తుగా ఉండటంతో రాంగ్ రూటులో వచ్చారు. అదే సమయంలో బి.మఠం నుంచి గిద్దలూరుకు కారులో ఆరుగురు వెళ్తున్నారు. ఇందులో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు, ఇద్దరు బాలురు ఉన్నారు. ఎదురుగా వస్తున్న వీరి కారును గోపాల్ డ్రైవింగ్ చేస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్, మునికుమార్‌వర్మ తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని ప్రొద్దుటూరు ప్రైవేట్ అసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో గోపాల్ మృతి చెందాడు. మరో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరికి బి.మఠం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందించి గిద్దలూరు పంపారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిన్నమండెం : మండలంలోని చిన్నమండెం -1 గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిద్దారెడ్డిని సస్పెండ్ చేస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాలు జారీ చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడకపోవడం, వివిధ పనుల కోసం వచ్చే ప్రజల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని పలువురు స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డిజిటల్ అసిస్టెంట్ సిద్దారెడ్డిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

హక్కుల సాధన కోసం సమష్టి పోరాటం

రాయచోటి అర్బన్ : గిరిజన హక్కుల సాధనకు సమష్టిగా పోరాడుదామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, విప్లవ గాయని విమలక్క తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్ ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అన్ని జిల్లాల నుంచి గిరిజనులు విచ్చేసి కదం తొక్కారు. మాసాపేట మార్కెట్ యార్డు నుంచి ప్రభుత్వ జూని యర్ కళాశాల మైదానం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అందరం ఒక్కటై పోరాడాలని పేర్కొన్నారు. అటవీభూమి హక్కుల ప్రకారం గిరిజనులు అటవీ భూములలో వ్యవసాయం చేసుకోవచ్చునంటూ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్రనేతలు మన్మథరావు, రాముడు, సత్యనారాయణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రానాయక్, పెంచలయ్య, లింబాడా సంఘం రాష్ట్రనేత శంకర్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, మహేష్, శ్రీనివాసులు, గిరిజన సంఘం నేత అమ్మునాయక్‌తోపాటు పలు జిల్లాల నుంచి వచ్చిన గిరిజననేతలు పాల్గొన్నారు.